
# మరో బాల్యం



- అయ్యగారి శ్రీనివాసరావు

బడినుంచి వచ్చేనరికి వీధి వాకిట్లో ఉన్న మట్టి జాగాలో పాతిన మొక్క కనబడింది. అప్పుడే పాతి నీళ్లు పోసినట్లుంది. కాస్తవాడిన ఆ మొక్కని చూసేనరికి సుబ్బారావ్ గుండెల్లో రాయిపడింది. అది ఒక నిత్యమల్లి మొక్క. ఆ భయంతోనే ఇంట్లో అడుగుపెట్టినతడికి గదిలో రెండు మూటలు, కుట్లువున్న బేగ్‌లోంచి చిందరవందరగా కొన్ని లోపలికి, కొన్ని బయటికి ఉన్న బట్టల్ని చూసేనరికి అతడి భయం మరింత ఎక్కువైంది.

అప్పుడే హాల్లో కొచ్చిన శ్రీమతినడిగాడు "అమ్మ ఎప్పుడొచ్చింది?" అని.

"అరగంటైంది" ముక్తసరిగా సమాధానం ఇచ్చి కాఫీ తేవడానికి లోపలి కెళ్ళిందామె. సుబ్బారావ్ బట్టలు

మార్చుకుని ముఖం కడుక్కుని వచ్చేసరికి కాఫీ కప్పుతో లోపలి కొచ్చిన శ్రీమతినడిగాడు.

"అయితే అమ్మ ఎక్కడికెళ్ళింది?" అని. ఆవిడ ఎక్కడికెళ్ళుందో తెలిసినా మరేమడగాలో తెలియక అడిగిన ప్రశ్న అది.

"ఇప్పుడే ఈ పక్క ఇళ్ళకెళ్ళి వచ్చి ఇప్పుడు ఎదురింటి వెంకాయమ్మగారింటికెళ్ళారు" అంది. ఆ మాటలన్నపుడు ఆవిడ కళ్ళల్లో మచ్చుకైనా ఉత్సాహం లేదనే విషయం కనిపెట్టాడు.

"నెలరోజులుంటానని వెళ్ళింది, పది రోజులు తిరగకుండానే వచ్చేసిందేమిటి?" స్వగతంగా ప్రశ్నించుకున్నట్టు అడిగాడు. దానికి సమాధానం ఆమె దగ్గర కాదు కదా! సాక్షాత్తు వాళ్ళ అమ్మదగ్గర కూడా ఉండదని తెలుసు. అయినా ఆవిడ వచ్చిందనే విషయం విని మతిస్థిమితంలేక మరేమడగాలో తెలియక అడిగిన ప్రశ్న అది.

దానికి సమాధానంగా భార్య నుంచి నిట్టూర్పు తప్ప మరేమీ రాకపోవడంతో మౌనం వహించాడు. ఆ మౌనంలోనే అతడి ఆలోచనలు గతంలోకి జారాయి.

అతడి చిన్నప్పుడు ఎవరైనా తల్లిదండ్రుల్ని ఆడిపోసుకుంటూంటే "కనిపెంచిన తల్లిదండ్రుల్ని ఎలా ఆడిపోసుకోగలుగుతారో" అనిపించేది. అది ఇప్పుడర్థమౌతూంది సుబ్బారావుకి.

ఇలా అంటే వాళ్ళ అమ్మ మీద అతడికిగాని, వాళావిడకుగాని ద్వేషం, అసహ్యం లాంటివున్నాయని కాదు. ఇంకా చెప్పాలంటే అతడికంటే అతడి భార్యకే అత్తగారి మీద ప్రేమ ఎక్కువ. కాని అది నిలబెట్టుకోలేకపోతూంది సుబ్బారావు తల్లి. అందుకే అతడి బాధంతా

సుబ్బారావు తండ్రి పోయాక అతడు జీవించి ఉన్నపుడు సంపాదించిన పెంకుటింటిలో ఆయన జ్ఞాపకాలు ఉన్న ఆ ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్ళనని మొరాయిస్తుందావిడ. దాంతో తల్లిని ఒక్కర్తినీ ఆ ఇంట్లో ఉంచడానికి కష్టం లేక ఆవిడకి తోడు కోసం దూరంగా పనిచేస్తున్నతడు ఆవూరి దగ్గరకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోక తప్పలేదు.

"శారదా" అనే పిలుపు వినబడేసరికి ఉలిక్కి పడ్డాడు సుబ్బారావు. ఆలోచనల్లోంచి తేరుకుని అటు చూశాడు. చేతిలో కొత్త పంచెల దొంతితో గూని వంచుకుని లోపలికొచ్చిన అతడి తల్లి అతడ్ని చూడగానే,

"ఏరా! బడి అయిపోయిందా? అవున్లే తల్లిముండా కూతురు వస్తున్నాను స్టేషనుకి రమ్మని ఉత్తరం రాస్తే అమ్మకంటే బడే ఎక్కువైంది కదురా?" ఉరుము లేకుండానే కుంభవృష్టి మొదలైంది. అయినా శాంతంగానే.

"ఉత్తరం రాశావా? అందలేదే" అంటూనే ఏదో గుర్తొచ్చిన వాడిలా "నువ్వే రాశావా? ఎవరిచేతనైనా రాయించావా?" అనడిగాడు. దానికి కారణం లేకపోలేదు. ఆవిడ తన బాల్యంలో రెండో క్లాసు చదివింది. అందువలన ఆవిడ తన చదువు మీద, తెలివి తేటలు మీద నమ్మకం చాలా ఎక్కువ. అందుకే ఆమె ఎవరికైనా ఉత్తరాలు రాయవలసి వస్తే రాయించదు. ఆమే స్వయంగా రాస్తుంది.

బ్రహ్మనుదుటి రాతనైనా ఏమైనా వరికరాలతో కష్టపడి చదవగలమేమోగాని ఈవిడ రాతని మాత్రం అర్థం చేసుకున్నవాడికి "నోబెల్ బహుమతి" ఇవ్వవచ్చు. ఆ విషయం అలా ఉంచి ఆవిడ అడ్రసురాసే విధానం



"గుళ్లో దేవుడిని ఏం కోరుకున్నారు?"
"శాంతినిమ్మని" తాపీగా చెప్పాడు ఆనందం.
అంటే నేను బ్రతికుండగూడదనేగా?" కళ్ళెర్ర జేసింది అండాళ్ళు.

కొత్తగూడెం
యు. చిట్టిబాబు

పరిశీలిస్తే ఆ అడ్రసు ప్రకారం పోస్టల్‌వాళ్ళు ఉత్తరాలని గమ్యస్థానం చేర్చాలంటే సర్వే డిపార్ట్‌మెంట్‌ని శరణుకోరవలసిందే.

"వెంకన్నగారి చిట్టి ఇంటికి ఎదురువాసలో నాలుగో ఇల్లు" లాటి పదాలు అడ్రసులో ఉంటాయి.

"నేనే స్వయంగా రాసి నిన్న బండెక్కేముందే డబ్బాలో స్వయంగా వేశాను" అన్న సమాధానం వచ్చింది ఆవిడ నుంచి.

ఆ సమాధానంతో పజిల్ విడిపోయింది. ఆవిడ అమాయకత్వానికి నవ్వాలో, జాలిపడాలో అర్థం కాలేదు. విషయం మార్చకపోతే వివత్కర పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందనే ఉద్దేశ్యంతో.

"అక్కడ అందరూ కులాసాయేనా? అన్న వదిన, పిల్లలు ఎలా ఉన్నారు?" అడిగాడు.

"పెద్ద వాడింట్లోను, చిన్నవాడింట్లోను అందరూ కులాసాయే" అంది.

"తమ్ముడింటికి కూడా వెళ్ళావా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం... వెళ్ళకూడదా? ఎప్పుడూ ఈ ఇల్లే నాకు లోకమేంటి? అయినా ఎప్పుడూ ఇక్కడే ఉంటే విలువా? పాడా?" ముక్కు చీదుతూ అంది. ఆ లక్షణాలు చూసి అతడికి భయం పట్టుకుంది. ఏమాట మాటాడినా వివరీతార్థాలు తీసి సాధించే ఆమె చాకచక్యానికి మనసులోనే జోహార్లర్పించాడు. మరి మాట్లాడకూడదని నిశ్చయించుకున్నాడు. కాని అంతలోనే గుర్తొచ్చింది ఆవిడతో మాట్లాడకపోయినా అతి ప్రమాదమే అని. అందుకే ఏదో అనబోతున్నంతలో ఆవిడే అంది.

"నీ దగ్గరుంటే నిర్లక్ష్యమే నేనంటే, పెద్దవాడూ చంటివాడే నయం. వాడో రెండు గుడ్డముక్కలు, వీడో రెండు గుడ్డముక్కలు పెట్టారు" అంది "పంచెలు" అనే అర్థంలో. "నువ్వూ వున్నావు ఎందుకూ? అంటూ వాళ్ళిద్దరూ ఆమె ఉన్నన్నాళ్ళూ ఎంత మర్యాదగా చూసారో, ఎంత బ్రహ్మరథం పట్టారో, సంఘటనలు, సంభాషణలతో సహా చెప్పింది. దాంతోబాటు సుబ్బారావు ప్రతి చర్యని వాళ్ళిద్దరితో పోల్చి మరీ చెబుతోంది. అవన్నీ మౌనంగా వింటున్న సుబ్బారావుకి బాధగా ఉంది. ఇన్నాళ్ళూ తను ఆవిడపై చూపించిన ప్రేమ, అభిమానం అంత వృధా అయిపోయింది. తనూ తన భార్య ఎంత బాగా చూసుకున్నా ఆవిడకి తృప్తి లేకపోయింది. పైగా ఒక వారం రోజులు చుట్టం చూపుగా వెళ్ళి వచ్చినపుడు వాళ్ళు చూపిన ఆదరాభిమానాలే పట్టుకుని తనకి అవేవీ ఇక్కడ లేవని భావించే అమ్మని చూస్తే జాలేసింది. బాధ కూడా కలిగింది. అక్కడే వుంటే ఇంకా ఏమంటుందోనని భయపడి పని వున్నవాడిలా బయటి కొచ్చేసాడు.

తనంటే వచ్చేసాడు గాని భార్య వెళ్ళిపోలేదుకదా?" అనే ఆలోచన వచ్చింది. కాని భార్యపై జాలి చూపటం తప్ప మరేమీ చెయ్యలేక అలాగ నడుస్తూ పార్కు చేరాడు.

జనం ఎక్కువగా లేనిచోట కూర్చున్నాడు. జనాన్నయితే తప్పించుకున్నాడు గాని ఆలోచనల్నుంచి తప్పించుకోలేకపోయాడు. అవి బలవంతంగా అతడ్ని చుట్టుముట్టాయి.

మిగిలిన ఇద్దరన్నదమ్ముల్లోనూ అతడి అన్న విశాఖపట్నంలోనూ, తమ్ముడు రాజమండ్రిలోను జీవనానికి లోటు లేకుండా ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వారిద్దరికీ మధ్య వాడైన సుబ్బారావుదే వారిద్దరి కంటే మెరుగైన టీచర్ ఉద్యోగం.

మిగిలిన కొడుకుల పరిస్థితి తెలిసే వెళ్ళదో, లేక దూరమని వెళ్ళదోగాని, అదీకాక తన అలవాటైన ఊరిని విడిచి వెళ్ళడం ఇష్టముండదో గాని ఎప్పుడూ సుబ్బారావుని విడిచి మిగిలిన కొడుకుల దగ్గరకెళ్ళదావిడ. ఎప్పుడైనా చూడాలనిపిస్తే వాళ్ళే వచ్చి నాలుగు రోజులుండి చూసిపోతారు.

వాళ్ళిద్దరి పరిస్థితి తెలిసిన వాడు రావడంతో వాళ్ళామెను పిలవకపోయినా ఏమనుకోడు సుబ్బారావు.

అలాటిది మొన్నామధ్య పెద్ద అన్న కూతురు పెద్దమనిషైందని ఉత్తరం రాస్తే తల్లిని తీసుకుని వెళ్ళింది భార్య. అక్కడ పనులైపోయాక తిరిగి వస్తూంటే తోడికోడలు ఉండమనడంతో "నెల రోజులుండి వస్తానులే" అంది అత్తగారు. అలా అన్నావిడ పది రోజుల్లోనే పెద్దవాడి దగ్గర, చిన్నవాడి దగ్గర కలిపి తిరిగి సుబ్బారావింటికి చేరింది.

ముసలితనం వస్తున్న కొలదీ మనుష్యుల్లో స్వార్థం ఎక్కువైపోతుంది కాబోలు. అంతేకాక మనుష్యుల్ని నమ్మకపోవడం, తనని ఎవరూ సరిగా చూడడంలేదని భయపడడం, వాళ్ళకి అనుకోకుండా వచ్చేస్తాయి కాబోలు. అదే వయసుకి చేరిన తల్లి ప్రవర్తన వల్లనే అలా అనిపిస్తోంది.

ఎంత ప్రేమగా చూసుకున్నా సరిగా చూడలేదనుకోవడం, ఏదో లోటు చేస్తున్నారని భావించడం పరిపాటైపోయింది. భార్యా భర్తలు క్షణ కాలం ఏకాంతంగా మాట్లాడుకున్నా తన గురించేదో చెప్పుకుంటున్నారని భావిస్తోందావిడ, ఫలితంగా భార్యా భర్తలు ఆ రకమైన సరదాలని కూడా మరచిపోయారు.

పాత వైభవాన్ని విడిచిపెట్టలేక ఇంటికి వచ్చిన దూరపు చుట్టాలకి సైతం చీరలనీ, బట్టలనీ, పిల్లలకి డబ్బులూ, బహుమతులు ఇప్పిస్తూంటే తట్టుకోలేకపోయేవాడు.

"మీ నాన్న లేకపోబట్టి కదా! నా బతుకిలా అయింది?" అంది.

"ఈ ఇంట్లో నేనంటే ఆవగింజపాటి విలువ కూడా లేకుండా పోయింది" అంది.

"ఇవాళ ఇలా అన్నవాళ్ళు రేపు తిండి పెట్టడానికి కూడా ఏడుస్తారు" అంది. ఇంకా ఏవేవో అంది. సుబ్బారావుకి బాధనిపించినా ఇంకా ఏమైనా అంటే మరింత గొడవౌతుందని భావించి మౌనం వహించాడు.

అలా ఊరుకోవడమే పెద్ద తప్పుగా భావించిన ఆవిడ.

"నేనింతలా అరుస్తూంటే నీకు చీమకుట్టినట్లైనా లేదు. ఎందుకుంటుంది. అదే అరిచి అరిచి ఊరుకుంటుందని ధీమా" అంటూ నసాయించడం మొదలెట్టింది.

తను తల్లినెంతగా ప్రేమగా చూస్తున్నా ఆవిడ కోరినవన్నీ కాదనకుండా తెచ్చిపెట్టినా ఆవిడ అభిమానాన్ని చూడలేకపోయాడు. నిత్యం ఉన్న మనిషికి బ్రహ్మరథం పట్టలేకపోవడానికి కారణం.

తమ్ముడింటికి, అన్న ఇంటికీ వెళితే ఉన్న నాలుగు రోజుల్లోనూ ఎంతో మర్యాదగా చూస్తే అలా తను చూడలేదంటే ఎలా కుదురుతుంది?

అది భరించలేడు, అలాగని ఏమీ అనలేడు.

"ఏంటోయ్ సుబ్బారావ్! ఒంటరిగా కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్" అన్న పలకరింపు వినబడేసరికి ఆలోచనల్నుంచి బయటపడి అటు చూశాడు. ఎదురుగా "కేదారం" నిలబడి ఉన్నాడు.

"ఏంట్రా కేదారం! ఎప్పుడొచ్చావ్" పలకరింపుగా అడిగాడు. వాళ్ళిద్దరూ చిన్నప్పట్నుంచి స్నేహితులు. ఉద్యోగరీత్యా "కేదారం" పైవూరిలో ఉన్నా స్వంత వూరిలో భూములున్నందున మూడు నెలల కొకసారి అయినా వస్తూంటాడు. వచ్చినప్పుడల్లా సుబ్బారావుని చూడకుండా వెళ్ళడు.

"ఇందాకే వచ్చాన్రా. ఇంటికెళ్ళాను. నువ్వు బయటికెళ్ళావని చెప్పారు. ఏంటి అంత దిగులుగా కూర్చున్నావ్. ఏదైనా ప్రోబ్లమా?" అన్నాడు పక్కనే కూర్చుంటూ..

ఆ మాట విన్న సుబ్బారావుకి ప్రాణం లేచొచ్చింది. తన మనసులో మాట చెప్పుకోడానికి ఒక మనిషి దొరికినందుకు సంతోషించాడు. అదీ కాక తమ మధ్య ఏ రహస్యాలూ లేవు. అందుకే తన బాధనంత చెప్పాడు కేదారానికి సుబ్బారావు.

ఆ మాట విన్న కేదారం "ముసలితనంలో వాళ్ళకి పిల్లల తత్త్వమే వచ్చేస్తుంది. దానికి చిరాకుపడడమెందుకు? పిల్లలు అల్లరి చేస్తే చిరాకుపడకూడదనుకుంటూనే ఆ అల్లరిని తట్టుకోలేక చిరాకుపడతామనుకో. కాని గట్టిగా చెప్పేకంటే వాళ్ళంతట వాళ్ళు అర్థం చేసుకునేట్టు చెబితేనే మంచిది" అంటూ చెవిలో ఏదో చెప్పాడు. ఆ మాట విన్న సుబ్బారావు ముఖం వికసించింది.

*** *** ***

"అమ్మా! నేను పనిమీద హైదరాబాదు వెళుతున్నాను. శారద కూడా పిల్లల్ని చూడడానికి పుట్టింటికెళతానంటోంది. నువ్వొక్కర్తివీ అన్నాళ్ళు ఇక్కడుండలేవు. అందుకే వైజాగ్ అన్నయ్య దగ్గరకి దిగబెడతాను. తిరుగుదలలో నేనే నిన్ను తీసుకొస్తాను. ఆలస్యమైనా నువ్వు వచ్చేకు. ఇంకా ఎక్కువ రోజులే పట్టొచ్చు నా పని" అన్నాడు.

ఆ మాటకి ఏమనుకున్నాదో గాని "సరే" అంది ఆవిడ.

*** *** ***

"అమ్మా! తమ్ముడు పదిహేను రోజుల్లో తీసుకెళతానన్నాడన్నావు. నెల్లాళ్ళు దాటిపోయినా రాలేదేంటి?" పెద్ద కొడుకు సూర్యం అడిగిన ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు కామేశ్వరమ్మగారికి.

సుబ్బారావు తనని పెద్ద కొడుకు దగ్గరకి పంపిన నాలుగు రోజులవరకూ బాగానే ఉంది. కాని చిన్న ఇల్లు, భార్య ఇద్దరు పిల్లలతో అతడు పడే ఇబ్బందితో ఆవిడకు ప్రశాంతత లేకుండాపోయింది. అదీకాక చిన్న జీతంతో అతడు ప్రతి విషయానికీ వాళ్ళు పడుతున్న ఇబ్బందులు వాళ్ళు చెప్పకపోయినా ఆవిడ కళ్ళబడుతూనే ఉన్నాయి. నీటికి, నివాసానికే కాకుండా ప్రతి చిన్న విషయానికీ ఇబ్బందిపడే వాళ్ళకి తనొక అదనపు బరువని వాళ్ళు అనకపోయినా తెలుస్తూనే ఉంది. అతి కష్టమ్మీద నెల్లాలు గడిపినామెకి ఇంక అక్కడుండాలనిపించలేదు. ఇంతలో కొడుకలా అడగడంతో పరిస్థితి పూర్తిగా అర్థమైంది. అయినా రెండోవాడు సుబ్బారావు "తను వచ్చి తీసుకెళ్ళే వరకూ రావద్ద"న్న మాట గుర్తొచ్చింది. అందుకే.

"అన్నీ దండలే ఉన్నాయి. విడిపూవుల్లేవా ఏం?" పూలకొట్టువాడిని అడిగాడు రాజు.

"అవునండీ! ఈ రోజు మీటింగ్ ఉందని కొనుక్కుపోయారు ఆ పార్టీవాళ్ళు" చెప్పాడు కొట్టువాడు.

"విడి పువ్వులెందుకని! ఆశ్చర్యపోయాడు రాజు. 'మీటింగ్‌కు వచ్చినవాళ్ళ చెవుల్లో పెట్టడానికట!' సమాధానమిచ్చాడు. కొట్టువాడు.

యు. చిట్టిబాబు
కొత్తగూడెం

ఒరే సూర్యం! సుబ్బడు ఇంకా వచ్చాడో లేదో. వాడొస్తే నేను రాజమండ్రిలో ఉన్నానని చెప్పు. నన్ను రాజమండ్రి చిన్నవాడి దగ్గర దిగబెట్టే" అంది ఆవిడ.

ఆ మాట విన్నవెంటనే మరో మాటకవకాశం ఇవ్వకుండా తల్లిని ఆఖరు తమ్ముడి దగ్గరకి తీసుకెళ్ళి దింపేసాడు సూర్యం.

కనీసం మాటవాసికైనా మరి రెండు రోజులుండమని అనలేని పెద్ద కొడుకుమీద జాలి వేసింది.

ఆవిడని దిగబెట్టిన పెద్దన్న సూర్యం అటు వెళ్ళగానే "అమ్మా! మొన్ననే కదా వెళ్ళావు. ఏంటి మళ్ళీ ఇపుడే వచ్చావు?" అని అడిగిన మూడో కొడుకు నారాయణ మాటకి చివుక్కుమన్నా విషయమంత చెప్పిందావిడ.

అది విన్న చిన్న కొడుకు "ఆ... హా..." అని మాత్రం అన్నాడు. ఆవిడ వచ్చిన దగ్గర్నుంచి చిన్న కొడుకు, కోడలు ముఖాల్లో ఏదో తెలియని అలజడి, ఏదో కంగారు కనిపెట్టిందావిడ. ఆవిడకే విసమ కూర్చాలని ఎంతో ప్రయాస పడి తెచ్చినట్టే అనిపిస్తోంది. అన్నింటినీ మించి చంటి పిల్ల పాల డబ్బాలకి, పెద్ద పిల్లడి చదువులకి పడే ఇబ్బందులు, కొడుకు కోడలు కనీసం సరైన బట్టలులేని పరిస్థితి అన్నీ కళ్ళారా చూస్తూనే ఉందావిడ. ఇదివరకు వచ్చినపుడు నాలుగు రోజులే ఉండడంతో పెద్దగా కనిపెట్టలేదు. కాని ఇప్పుడవన్నీ కళ్ళారా చూస్తూ ఇక ఉండలేకపోయింది.

"వారం రాజులైనాక చిన్న కొడుకు ఒక సాయంత్రం ఇంటికొస్తూ "అమ్మా! అన్నయ్య ఊరి నుంచి వచ్చి చాలా రోజులైందట. నిన్ను తీసుకెళ్ళడానికి టైం లేక రాలేదట. నాలుగైదు రోజుల్లో వచ్చి తీసుకెళతానని రాసాడు" అన్నాడు. ఆ మాటకి.

"నువ్వెప్పుడు ఉత్తరం రాశావు వాడికి?" అనడిగింది. ఆమె అడగడంలోని గడుసుదనం గుర్తించని చిన్న కొడుకు.

"నువ్వు రాగానే రాశాను" ఏదో గుర్తొచ్చిన వాడిలా సిగ్గుతో ఆగిపోయాడు. ఆ మాట ఆవిడ విన్నా అతడు సిగ్గు పడడంతో అతడి పరిస్థితి అర్థమైంది.

పెద్దవాడింట్లోనూ, చిన్నవాడింట్లోనూ ఎప్పుడూ లేని విధంగా ఎక్కువ రోజులుండడంతో వారి అవస్థలు, తక్కువ జీతాల వలన వాళ్ళు పడే ఇబ్బందులూ, తల్లి దగ్గర ఆ విషయం బయటపడకుండేందుకు వాళ్ళు పడే తాపత్రయం. ఎంత దాచుకున్నా దాగని చిరాకులు కూడా చవి చూడగలిగింది. అప్పుడు గుర్తొచ్చాడు సుబ్బారావు. తన నెంత ఆప్యాయంగా చూసుకున్నాడో ఎంత విలువిచ్చేవాడో అది గుర్తించని తను ఎలా మూర్ఖంగా ప్రవర్తించేదో అర్థమై బాధ పడింది.

అందుకే ఒరేయ్ నారాయణా! సుబ్బడ్ని చూసి చాలా రోజులైందిరా! ఇవాళ ఎన్ని గంటలకి బండి?" అనడిగింది. అది వినగానే.

"రేపు ఉదయం ఎనిమిది గంటలకుంది. సాయంత్రానికి దిగిపోవచ్చు" అన్నాడు.

"అయితే రేపు ఆ బండికి దిగబెట్టిరా!" అంది. ఆ మాటకి నరేనన్న కొడుకు జవాబు విని కోడలెందుకో అతడ్ని పిలిచింది. వాళ్ళిద్దరూ కొన్ని క్షణాలు గుసగుసలాడుకున్నాక కొడుకు తల్లి దగ్గరకొచ్చి

"అమ్మా! అప్పుడే వెళ్ళిపోవడమేమిటి? వచ్చినదానివి మరి నాలుగు రోజులుండు" అన్నాడు. అలా అన్నప్పుడతడి గొంతులో ఆప్యాయత కన్నా ఆర్థిక ఇబ్బందే కనిపెట్టగలిగింది.

నాలుగు రోజుల్లో వచ్చే ఫస్టు తారీఖుని తలుచుకుంది. జీతాల్లో, లేక రెండో అన్న సుబ్బారావో ఎవరు ముందొచ్చినా తల్లిని పంపించవచ్చని ఆలోచిస్తున్న కొడుకు ఆలోచన అర్థమైంది. అందుకే ఆ విషయం తెలియని దానిలా లోనకెళ్ళి తన బేగులో ఉన్న పర్సులోంచి వంద రూపాయల కాగితం తీసి చిన్న కొడుక్కిస్తూ

"ఒరేయ్! చిన్నవాడి మీదకి మనసెళ్ళిపోయిందిరా! నేనొక్కదాన్ని వెళ్ళిపోగలను. నాకు రేపటి రిజర్వేషను చేయించి" అంది. తల్లి సమయస్ఫూర్తి గ్రహించినా బాధపడడం తప్ప మరేమీ చేయలేని ఆ నగటు ఉద్యోగి ఆవిడ చేతిలో వంద రూపాయల నోటు అందుకున్నాడు.

★ ★ ★

చేతిలో ఏ బరువూ లేకుండా మామూలు బేగుతో దిగి నడిచి వస్తున్న తల్లి కెదురెళ్ళాడు సుబ్బారావు. ఆవిడని పలకరిస్తూనే

"అమ్మా! నువ్వొక్కర్తివే వచ్చేసావేమిటి? తమ్ముడిని తీసుకొచ్చి దిగబెట్టమన్నాను కదా? వాడు దిగబెట్టకపోతే నాలుగు రోజుల్లో నేనే వద్దామనుకున్నానే" అన్నాడు.

ఆ మాట విన్న కామేశ్వరమ్మ "ఒరేయ్ సుబ్బా! ఈ మధ్య మరేవూరూ కేంపు లేదా?" అడిగింది. ఆ మాటకి సమాధానంగా

"లేదమ్మా! ఏం?" అనడిగాడు.

"ఏం లేదు. ఈ మాటు నీకే వూరైనా కేంపులుంటే నువ్వూ కోడలూ ఇద్దరూ వెళ్ళిపోకుండేం నేనొక్కదాన్నీ ఉండలేను. ఇంక అన్ని వూళ్ళూ తిరగలేను. ముసలి ముండని. ఓపిక లేదు" అంది అక్కడే ఉన్న కోడలుతో.

"శారదా! చాలా రోజులైంది. అలా భక్త సమాజం వేపు వెళ్ళొస్తానే" అంటూ గుమ్మం దిగి నడిచిందావిడ.

అలా వెళుతున్న తల్లిని చూసి అనవసరంగా ముసలితనంలో ఆవిడని బాధ పెట్టినందుకు బాధ పడ్డాడు సుబ్బారావు.